

స్వయంకృతం

సరస్వతీ బాబూరావ్

ఎంబాసిడర్ హారన్‌మోత విన్న సుజాత ఇంట్లోనుండి అరుగుమీదకు వచ్చింది. కారులోనుండి తూలుతూ దిగుతున్న భర్తను విస్మయంగా చూసింది. మరుక్షణమే ఖంగారుతో గబగబా మెట్లుదిగి వెళ్ళి సుందరానికి ఆసరాగా నుంచుని,

'ఏ మ య్యం ద ం డి ? ఎందుకలా వున్నారు ?' అంది వణికిపోతూ.

మూతలు పడిపోతున్న కనురెప్పల్ని తెరవటానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు సుందరం. మరొక అడుగువేస్తూ తూలిపోతున్న సుందరాన్ని డ్రైవర్‌వచ్చి రెండవ వైపు పట్టుకొన్నాడు. అతి కష్టంమీద హాల్లోకి చేర్చారు సుందరాన్ని.

'నేను మేడమీదకు రాలేను' అస్పష్టంగా గొణిగాడు సుందరం.

'అలాగే. ఇక్కడే సోఫామీద పడుకోండి' అంటూ అతని తలక్రింద 'దిండునుపెట్టి సరిజేసింది.

సోఫాలో కళ్ళుమూసుకు పడుకొన్న సుందరం ఆ క్షణాన్ని ఒక గ్రీక్‌శిల్పం మెరిసిపోతున్నట్లు కనిపించాడామెకి.

'భగవంతుడా ! ఏమిటీ విపరీతం ! అనుకొందామె

'అమ్మా. మీరేం బయపడకండమ్మా నేను వెళ్ళి మీ అన్నయ్యగార్ని తీసికొస్తాను మీరు డాక్టరుకు ఫోను చేయండమ్మా' అంటూ డ్రైవరు బైటకు పరిగెత్తాడు.

ఆచేతనావస్థలోవున్న సుజాతకు అప్పటికిగాని తన కన్నీటితో చెంపలు తడిసిపోయిన సంగతి గుర్తు రాలేదు. చెంగుతో కళ్ళొత్తుకొని ఫోను వైపు వెళ్ళింది.

'సుజీ!' సుందరం నెమ్మదిగ పిలిచిన ఉలిక్కిపడింది సుజాత.

అతని ప్రక్కగవచ్చి కూర్చుంది. పరీక్షగ భర్త వైపు చూసింది. అతనేదో చెప్ప ప్రయత్నిస్తున్నాడు మూతలు పడిన కళ్ళను తెరిచేందుకు ఇబ్బంది పడతున్నాడు.

అప్పటికే పావుగంట గడిచిపోయింది! 'డాక్టరు వచ్చేస్తూ వుండాలి. బాధగా వుందా? ఎలావుంది? ఇటు చూడండి' అతడి ముఖాన్ని చేతుల్లోకి తీసికొని ఆప్యాయంగా ముందుకు వంగింది సుజాత. అతడేమీ మాట్లాడలేదు. తన కుడిచేతిని అతి కష్టంమీద జరిపి సుజాత చేతిని గట్టిగ పట్టుకొన్నాడు.

కాంపౌండ్‌లో ఎంబాసిడర్‌తోబాటు కాడిలాక్ కూడ ఆగింది. అయినా సుజాత లేవలేదు. భర్త సాన్నిధ్యం మరెన్నటికీ లభించదేమో నన్నట్లు అతడిని దగ్గరగ అనుకొని తన చేతిలోవున్న అతడి చేతిని ఆప్యాయంగ నిమురుతోంది. డాక్టర్ వస్తూనే 'ఏం జరిగిందమ్మా' అన్నాడు.

మెల్లిగ లేచి నిలబడింది సుజాత.

'ఆఫీసునుండి ఇప్పుడే వచ్చారు. మనిషి ఎలాగో వున్నారు. మాట్లాడటంలేదు. కనీసం చూడటమైనా లేదు డాక్టర్' అన్నది. అప్పుడామె కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

డాక్టరు ప్రక్కనే మానులా నిలబడివున్న అన్న శంకరాన్నిచేరి అతడి భుజంపై వాలిపోయింది సు జా త. పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకొనేందుకు శతవిధాల ప్రయత్నిస్తోంది.

'నిబ్బరంగ వుండు. డాక్టరొచ్చేడుగా.

మరేం ఖంగారుపడకు. ఏం భయంలేదు. సరిగ్గా గంట — అంటే అరవై నిమిషాలు గడవనియ్యి. అరవై ఒకటో నిమిషంలో నీ మొగుడు నిన్ను కాఫీఅడిగి మమ్మల్ని మా దారినపొమ్మని గోలచేస్తాడు. ఓ.కె?' చెల్లిని సముదాయించే పద్ధతి క్షణంలో కనిపెట్టిన శంకరం మేధావి కావచ్చుకాని అంతమాత్రాన అతని అంతరంలో దిగులు ఛాయలు దూరంకాలేదు.

'శంకరంగారూ! అమ్మాయిని అవతలకు తీసికెళ్లండి. మీతో మాట్లాడాలి' అన్నాడు డాక్టరు'

శంకరం చెల్లెల్ని ప్రక్కగదిలో వుంచి డాక్టరు దగ్గరకు వెళ్ళాడు.

తనగదిలో సుజాత అన్నయ్య హామీ ప్రకారం నిమిషాలు లెక్కపెడుతోంది. అరవై నిమిషాలు కాకముందే—పదకొండో నిమిషానికే శంకరం శోకమూర్తిలా తన ముందు ప్రత్యక్షమైనప్పుడు సుజాత తత్తరపడింది.

'నా లెక్క తప్పింది చెల్లీ. మనకిక సుందరం లేడమ్మా' అన్నాడు.

ఎంతో సేపటినుండి నిగ్రహించుకొన్న ఆమె దుఃఖం యిక ఆగలేదు. కొంచెం సేపటికి వడలిన తోటకూర కాడలా చేతుల్లోనుండి పడిపోతున్న సుజాతను మరింత గట్టిగ పట్టుకొని 'సుజీ—సుజీ' అని కుదిపివేశాడు శంకరం ఆదుర్దాగా.

సుజాతకు తెలివి వచ్చేసరికి ఆమె తల వదినగారి వడిలోవుంది. ఏడ్చిఏడ్చి వదినముఖమంతా కందిపోయి ఎర్రగ వుంది. సుజాత చుట్టూ ఇరుగు పొరుగువారు పదిమంది వరకూ వున్నారు చుట్టూ వింతగ చూసింది సుజాత. వదినను చూస్తూ—

'ఏడుస్తున్నావా వదినా?' అని మాత్రమే అనగలిగింది.

'మనిషి ఎంత మంచివాడమ్మా. ఈ మాయదారి గుండెజబ్బు ఇంత చిన్న వయస్సులో ఎలా వచ్చిందోనమ్మా'

'మంచివాళ్లకి దేవుడి పిలుపు యింత చిత్రంగానే వుంటుంది.'

'ఇక్కడకు వచ్చి ఆరునెలలు కాలేదు ఎంతమందికి ఎన్నివిధాల సహాయాలు చేశాడు.'

సుజాత చుట్టూ చేరిన ఆడవాళ్లు తలొక విధంగా అనుకొంటున్నారు.

సుజాత లేచి కూర్చుంది. భర్తకు ప్రమాదమని తెలిసిన క్షణంలో వున్న భయం ఇప్పుడు లేదు. అప్పుడు ఏదైతే జరుగకూడదని ఊహిస్తూ భయపడి ఏడ్చిందో—అది తు. చ. తప్పక జరిగి ఇంతమంది తనని సముదాయిస్తున్న సమయంలో తనకు దుఃఖం రావటంలేదు.

వదిన యింకా ఏడుస్తూనే వుంది. సుజాత కంటిలో నీటిచుక్క లేకపోవటం ఆమెకు భయం కలిగించింది. ఆమె లేచి శంకరం దగ్గరకు వెళ్లింది.

సరిగ్గా అప్పుడే తుఫానులా దూసుకు వచ్చింది రేణుక. వచ్చి అన్నది.

'ఎంతఘోరం జరిగిపోయింది సుజాతా! మీకింతకష్టం జరుగుతుందని నే ననుకోలేదు.'

సుజాత రేణుకవైపు కన్నార్పకుండ చూసి 'కూచోండి. ఈ కష్టం చాల కష్టంగా వుంది. పాపం! మీకూ బాధగానేవుంది. బాధపడేవాళ్లు నాతో డజనుమంది వున్నారు ఈ గదిలో ఏడవకండి రేణుకా. ఏంచేస్తాం? జరగకూడనిది జరిగిపోయింది. వదినా మా అందరికీ కాఫీ పట్టా...'

సుజాత మాటలధోరణి విన్న అమ్మలక్కలు మరింత కలవరపడ్డారు. ఏం చేయాలో ఒక్కరికి తోచిందికాదు.

రేణుక సుజాతకు చేయి అందించి అన్నది. 'నెమ్మదిగ లేవండి' సుందరం గార్ని చూద్దాం.'

యాంత్రికంగ లేచిన సుజాత భుజంపై చేయివేసి శవం వున్నచోటికి తీసికెళ్లింది రేణుక.

అప్పటికే సుందరానికి అంత్య సంస్కారాలకు కావల్సిన ఏర్పాట్లు జరిగిపోతున్నయి. కొత్తబట్టలు, తలంటి పోసికొన్నతల ముఖాన నామంతో పడుకొన్న సుందరం కొత్త పెళ్లికొడుకులా వున్నాడు. అగరు వాసనలతో ఆ వరండా అంతా నిండివుంది. ఆఫీస్‌స్టాఫ్ చాలమంది వచ్చి నిలబడ్డారు

సుజాత కివేమీ పట్టలేదు. నెమ్మదిగ అడుగులో అడుగువేసి కొంటూ రేణుకతో పాటు వచ్చి శవం ప్రక్కనే కూర్చుంది. గుండెల్లో దాగిన బరువంతా గొంతుకలో చేరగా కుప్పలా కూలిపోయింది సుజాత.

'లే తల్లీ. నువ్వెంత యేడ్చి ఏంలాభం చెప్పు. రా...అమ్మా. నా తల్లివికదూ.' ఒకప్రక్క ఏడుస్తూనే ఆడపడుచును సముదాయిస్తోంది వదిన

'నేను మాత్రం ఎందుకు బతకాలి వదినా' ఏడుస్తూ వదినను కౌగలించుకొంది సుజాత.

శంకరం వచ్చి సుజాతను బలవంతంగ ఇవతలకు తీసుకు వచ్చాడు. కొంచెంసేపటికి దుఃఖం ఉధృతం తగ్గిన తర్వాత అన్నను అతుక్కొని నిలబడిన సుజాత—

'అన్నయ్యా అప్పుడే తీసికెళ్లటమేమిటి? మా వాళ్లెవరూ రాలేదుగా. అందర్నీ రానివ్వు.' అంది ఆశ్చర్యంగా అప్పుడే ఈలోకంలోకి వస్తూ.

'అలా చేయాల్సి వచ్చింది మరి, ఇప్పుడిక టైమ్‌లేదు.'

'వీల్లేదన్నయ్యా! కనీసం మా వారి అన్నగారైనా వచ్చేవరకూ వుండనీయ్. వారొక్కరూ వచ్చే వరకు మా వార్ని తీసికెళ్లకు. ఈ పొరపాటుని ఆయన క్షమించరు. జన్మలో నన్ను క్షమించరు' అంది ఆవేశంగా.

'అమ్మాయ్ నేను నీ అన్నని. నీవు నా ప్రాణానివి. నేను అన్నీ ఆలోచించే ఈ ఏర్పాట్లు చేశానమ్మా. సుందరం దహన సంస్కారాలు ఎంత త్వరగ అయితే అంత మంచిది. నన్ను బలవంత పెట్టకు. ఇంకేమీ అడక్కు.' ఖచ్చితంగ వచ్చిన ఆ మాటలు విని మరి మాట్లాడలేదు సుజాత.

* * *

మేడపైన గదిలో పడుకొన్న సుజాత కిటికీలో నుండి నిశ్చలంగ బయటకు చూస్తోంది. ఆచూపులో జీవం లేదు. కళ అంతకంటె లేదు. నిస్తేజంగ, నిర్లిప్తంగ చూస్తున్న ఆ చూపులో ఆమె భావం ఎవరికీ అర్థంగాదు. సుందరం పోయి వారం కావస్తోంది. ఈ వారం రోజులూ ఆమె పరిస్థితి యిలాగే వుంది. ఎవరు పిలిచినా పలుకదు. ఏమీ తినదు. పూట పూటకు ఆమెతో భోజనం చేయించటం శంకరానికి ప్రళయమై పోతోంది.

సుజాత మనస్సంతా శూన్యంగా భారంగా వేదనగా వుంది గతంలోని జ్ఞాపకాలు మనస్సును కలిచి వేస్తున్నయి.

తను బి. ఏ. లో వుండగానే తండ్రి

ఎన్నో సంబంధాలు తెచ్చాడు. అందులో చాలమంది ఆయనిచ్చే కట్నంపై మోజుతో తప్ప సుజాతపై అభిమానంతో కాదన్న వంగతి సుజాత బాగానే గ్రహించ గలిగింది. అలాటి వ్యక్తులతో తాను సుఖపడలేనని తెలిసి కొంది. అందుకే తండ్రితో వద్దని చెప్పింది.

'నాన్నా. నాకు అందంలేదు. కాని ఐశ్వర్యం వుంది డబ్బుకి మొహం వాచే వాళ్లని నన్ను పెళ్లిచేసికో మనడం భావ్యంకాదు నా డబ్బును ప్రేమించే మనిషిగాక నన్ను ప్రేమించే మనిషే నాకు భర్తగా కావాలి. నాకు అందం లేకపోవచ్చు కాని హృదయముంది నాన్నా' అంది

ఆ తర్వాత తండ్రి ఆమె నెన్నడూ పెళ్లి విషయమై బలవంత పెట్టలేదు. మళ్లీ సంవత్సరానికి ఆ ఊరికి ఉద్యోగ రీత్యా వచ్చిన సుందరంతో—ఒక పార్టీలో పరిచయమైంది. అందమైన సుందరం సుజాత కంఠస్వరాన్ని తెగ మెచ్చుకొనేవాడు. ఆమె మాట్లాడుతుంటె గండుకోయిల పాడినట్లు, వీణ మీటినట్లు వుంటుందని ప్రశంసించే వాడు అప్పట్లో ఆమె తన వివరాలేమీ సుందరానికి తెలియకుండ జాగ్రత్త పడింది. కొన్నాళ్ల తర్వాత ఒక సంధ్యాసమయంలో అతడి దగ్గర తన వివాహ ప్రసక్తి తెచ్చింది. అతడు చిరునవ్వు నవ్వాడు.

'నేను డబ్బుగల వాడినికాను. నా కున్న

స్వయంకృతం

ఆస్తంతా నా ఉద్యోగం. ఈ ఉద్యోగం మనిద్దరినీ బ్రతికించుకో గలదు ఇది చాలు. ఏ మంటారు?' అన్నాడు.

'నేనూ అంతే. నా డిగ్రీతో మీకు సహాయ పడగలననే అనుకొంటున్నాను కాని మీలో వున్న అందం నాకులేదు'

'నిజానికి అందమైన వాళ్లంటే నాకూ ఇష్టమే, కాని మనసు పరంగ మీ రెంతో నచ్చారు.'

వివాహం జరిగిన తర్వాత సుందరంతో అతడి ఇంటికి వెళ్లింది కాని కొద్ది రోజుల్లోనే తన తప్పు తెలిసి కొంది. ఏ ప్రేమనయితే తన భర్త నుండి కోరుకొందో అది తనకు అలభ్యమే అయ్యింది. పైగా తన డబ్బుకోసమే తనను వివాహం చేసి కొన్నాడని తెలిసికొన్న రోజున కుమిలి కుమిలి యేడ్చింది. సుందరం తెలివిగలవాడు. సుజాత పుట్టుపూర్వోత్తరాలన్నీ సేకరించి ఏమీ ఎరగనట్లు నంగనాచిలా నటించి ఆమెను భార్యగాచేసి కొన్నాడు.

అతడి ప్రేమకోసం ఆమె అలమటించి పోయింది. ఏనాటికైనా అతడి హృదయంలో స్థానం లభిస్తుందేమోనని రోజులు, నెలలు సంవత్సరాలు ఎదురు చూసింది. డబ్బుతో అతడిని బంధించాలనీ. వలపుతో లాలించా లని చూసింది. ఫలితంగ అతడికి మరింత



దూరం అవుతూ వచ్చింది. అందమైన అతడి ముఖాన్ని... ఆకర్షణీయమైన ఆ విగ్రహాన్ని చూస్తూ ఎన్నో రాత్రులు నిదరలేకుండ గడిపింది. వెన్నల్లా కనిపించే అతడి గుప్పెడు రాతి హృదయం మాత్రం కరుగలేదు. అతడు దూరమవుతున్న కొద్దీ అతడిని దగ్గర చేసుకోవాలనే సుజాత కోర్కె బలీయ మవుతూ వచ్చింది.

'సుజీ, ఏం చేస్తున్నావమ్మా' మృదువుగా అడుగుతూ వచ్చి ప్రక్కనే కూర్చున్నాడు శంకరం.

'ఏమీ లేదన్నయ్యా' లేచి కూర్చుంటూ అంది.

'చూడమ్మా, నీ విలా మంచంపడితే నేనేం కావాలి చెప్పు. నిన్ను కళ్లలోపెట్టి చూసుకొనే మీ వదినా నేనూ వున్నాం. నీ విలా వుంటే మాకేమీ కాళ్లాడటం లేదు. నిన్ను ఏది అడగాలన్నా అడగలేక పోతున్నా'

సూటిగ అతడి కళ్లల్లోకి చూస్తూ అన్నది సుజాత.

'ఏమైనా అడగదలిస్తే అడుగు.'

చెల్లెలిని నిదానంగ చూస్తూ—

'ముందు నాకు నువ్వొక మాట యివ్వాలి.'

ఏమిటన్నట్లు చూసింది.

'ఏ పరిస్థితులలోను నువ్వు ఎలాంటి అఘాయిత్యం చేయనని మాటివ్వు.'

పేలవంగ నవ్వింది.

'అలాటి ఉద్దేశ్యమే వుంటే అన్నయ్యా! నేను మా వారితో సహగమనం చేసేదాన్ని.'

కొంచెంసేపు ఇద్దరూ మాట్లాడలేదు.

'చూడు సుజీ. నిన్నొకటి అడగాలను కొంటున్నాను సుందరానికి నీకూ ఈ మధ్య ఏమైనా కలతలు వచ్చాయా? అతడే మైనా బాధపడుతున్నట్లు కనిపించాడా?'

చిత్రంగా చూసి లేదన్నట్లు తల తిప్పింది.

'మరి ఎందుకలా చేశాడు?' తనలో తను అనుకొన్నట్లు అన్నాడు.

'ఏం చేశారు?' ఆదుర్దాగా అడిగింది.

నిశ్చలంగ ఆమె వంక చూశాడు శంకరం. తర్వాత—

'అతడు ఆత్మహత్య చేసికొన్నాడమ్మా' అన్నాడు

'అదేమిటి? మరి గుండెజబ్బు......'

'ఆత్మహత్య చేసికొన్నాడని తెలిస్తే సవాలక్ష ఆరాలకి అవసరమని అలా చెప్పేము.' శవాన్ని ఎక్కువసేపు వుంచక పోవడానికి కూడ కారణం అదే.'

స్థాణువులా కూర్చుండిపోయింది సుజాత.

'సుజాతా! నీ కోసం రేణుక వచ్చిందమ్మా' వదిన వచ్చి చెప్పింది.

'లోపలికిపంపు వదినా' సుజాత గుండెలపై చేయివేసి గట్టిగా పట్టుకొంది వణుకుతూ.

'ఆయనెందుకలా చేశారన్నయ్యా' అంది.

'అదే తెలియటంలేదు. డాక్టర్... నీవూ.. నేనూ...మన ముగ్గురి మధ్య రహస్యం వుండిపోవాలి జాగ్రత్త. పెదవి దాటితే ప్రమాదం.' భుజంపై తట్టుతూ లేచాడు.'

రేణుకను చూసి శంకరం బయటకు వెళ్ళాడు.

మోకాళ్ళపై తల పెట్టుకొని కూర్చుని వుంది సుజాత. రేణుక మంచం దగ్గరగా స్టూలు లాక్కొని కూర్చొంది.

'నేను మీకు ఒక విషయం చెప్పాలని వచ్చాను.'

'చెప్పండి' అంది నెమ్మదిగ.

'ఆ రోజు.. సుందరం చనిపోయే ముందు మా ఇంటికి వచ్చారు. అప్పుడు చాలా మామూలుగా చాల ఆరోగ్యంగా వున్నారు.'

కళ్ళు పెద్దవిచేసి చూస్తూ కూర్చొన్న సుజాత —

స్వయంకృతం

'నేను వచ్చిన తర్వాతే వచ్చారా?'

'అవును. మీరు అయిదుగంటలకు వెళ్ళిపోయారు అయిదున్నరకు నాకు కాఫీ త్రాగే అలవాటుంది గదా నేను లేచి డైనింగ్ రూంలోకి వెళ్ళబోతుండగ సుందరం కారు ఆగింది పది నిమిషాలు కూర్చున్నాడు.'

'ఆయన మీ ఇంటికి తరుచు వచ్చేవారా?'

'తరుచూ కాదుగాని అప్పుడప్పుడు వచ్చేవాడు.'

'మా వారా? ఇలానే వచ్చిపోవడమనే విషయంమీరుగాని, ఆయనగాని నాకు చెప్పనే లేదు కదా ?'

రేణుక భయపడుతూ అన్నది.

'చెప్పవద్దని అతడే కోరాడు. ఎందుకలా అన్నాడో తెలియదు మీరు తరుచూ మా ఇంటికి వచ్చేవారు కదా. ఏదో ఒక రోజు మీ రిద్దరూ ఎదురుపడక పోతారాని నేను అనుకొన్నాను కాని అలా జరుగలేదు.'

'ఆ రోజు మీతో ఏమైనా కష్టంగా మాట్లాడారా ?'

'లేదు చాల హుషారుగ వున్నాడు. కాఫీ అడిగాడు. ఇచ్చాను.'

'ఫ్లాస్కులో కాఫీనే యిచ్చారా ?' నిర్వంగ అడిగింది.

'అవును. నేనింకా త్రాగలేదుకదా? మళ్ళీ పెట్టుకోవచ్చని అతడికి ఆ కాఫీనే యిచ్చాను తర్వాత వెళ్ళిపోయాడు.'



'ఒక్కమాటడుగుతాను. నిజం చెప్పండి. మిమ్మల్ని వారు ప్రేమించా రవునా?'

'సుజాతా...'

'ప్రేమ కథలు తమాషాగా వుంటాయి రేణుకగారూ, ఒక్కొక్కసారి ప్రాణాలూ తీస్తాయి. వెళ్ళిరండి. మీ వారు మీకోసం ఎదురు చూస్తుంటారు వెళ్ళండి కనీసం మీ వారినైనా బ్రతకనీయండి క్షేమంగా, వెళ్ళండి ప్లీజ్...'

రేణుక నిశ్చేష్ఠురాలైంది. ఎలాగో లేచినిలబడి ఆగది విడిచి వెళ్ళిపోయింది.

* * *

సుజాత కళ్ళు తెరిచేటప్పటికి ప్రొద్దు వాలింది. తన ప్రక్కనే శంకరం కూర్చొని చదువుకొంటున్నాడు.

'ఇది త్రాగమ్మా' పళ్ళరసం అందించాడు.

చేతితో నెట్టివేసింది.

కళ్ళు బరువుగా మూతలు పడుతున్నయి మగతగవుంది జ్ఞాపకాలతో గతం మళ్ళీ కళ్ళముందు కదలాడింది.

భర్త తనసంత నిరాదరణ చేయడానికి కారణం తెలియడానికి ఎంతోకాలం పట్టలేదు. ఆఫీసులో బయల్దేరిన భర్త సరాసరి ఇంటికి రాకపోవటం, ఒక్కొక్కరాత్రి చాల ఆలస్యంగా ఇంటికి రావటం ..తను కారణం అడిగితే తేలిగ్గా త్రోసిపుచ్చటం ...ఇవన్నీ తనను చికాకుపరిచి మనశ్శాంతి లేకుండా చేసినయి. ఏమీ చేరగానిదానిలా తను కూర్చోటం తనకే బొత్తిగా నచ్చలేదు.

అందుకే నిజాన్ని తెలిసికోవాలని భర్తను చాటుగ వెంబడించింది. అతడు వెళ్తున్న దాబాఇల్లు చూసింది. ఆ ఇంటి వివరాలు తేలిగ్గానే కనుక్కోగలిగింది ఆ రాత్రే భర్త యింట్లోలేని సమయంలో అతడి డైరీ అంతా చదివింది.

రేణుక, సుందరం గాఢంగా ప్రేమించుకొన్నారు కలలు కన్నారు. ఊహలలో విహరించారు. గాలిలో మేడలు కట్టారు. కాని అహ్వాధికారియైన రేణుక తండ్రి ఈ అనామకుడైన సుందరాన్ని అల్లుడిగ స్వీకరించలేక పోయాడు. తండ్రి కోసం తన ప్రేమను త్యాగం చేస్తున్నానని చెప్పి వెళ్ళిపోయింది రేణుక ఆఖరి సారి. ఆనాటినుండి సుందరంలో డబ్బు

మీద; డబ్బుగల వారిమీద కసి పెరుకొంది. అయినా ఆ డబ్బులోనే జీవించాలని తెలివిగ వలపన్ని సుజాతను చేపట్టాడు.

అమూల్యమైన సుజాత ప్రేమను అందుకోవాలని ఎంతో ప్రయత్నించే వాడు. కాని రేణుక జ్ఞాపకాలు అతడిని బంధించి వేసేవి.

ఏమీ చేయలేక చేతగాక సతమతమయ్యేవాడు.

సుజాత అంటే ఆదరం లేదు. ప్రేమా లేదు.

అన్నీ తెలిసికొన్న సుజాత ఒక నిర్ణయానికి వచ్చింది.

ఒక పార్టీలో పనిగట్టుకొని రేణుకను పరిచయం చేసికొంది. లమెమీద ఎనలేని జుగుప్స పెంచుకొంది. అయినా పైకి స్నేహం నటించి వాళ్ల ఇంటికి రాకపోకలు సాగించింది.

ఆ రోజు...ఆ రోజు...సుందరం చని పోయినరోజు ..నాలుగు గంటలకు ఒక స్థిర నిశ్చయానికి వచ్చి రేణుక ఇంటికి వెళ్లింది.

రేణుక సాదరంగ ఆహ్వానించింది.

ఫ్లాస్కులో వున్న కాఫీ ఇచ్చింది.

కాఫీ సిప్‌చేస్తూ 'మీరూ తీసికోండి' అంది సుజాత.

'నేను మాటి మాటికి త్రాగను. మూడు గంటలకు, మళ్లీ ఐదున్నరకు ఒక కప్పు త్రాగుతాను.' అంది రేణుక.

'రెండవసారి శ్రీ వారితో కలిసి త్రాగు తారన్నమాట' నవ్వింది సుజాత.

'అవుననుకోండి. కాని ఈరోజు వారులేరు. క్యాంప్ వెళ్లారు. రెండురోజుల వరకూ రారు'

'మరి కాఫీ......'

'నేనదే వేళకు త్రాగులాను.' నవ్వింది రేణుక.

కాఫీ పూర్తిచేసిన సుజాత.

'ఆ రోజు విహా మ్యారేజి ఫోటోలు చూపుతానన్నారు.' అంది.

'ఓ మర్చిపోయాను. కూర్చోండి తెస్తాను.'

మేడపైకి వెళ్లింది రేణుక. ఈ అవకాశంకోసమే చూస్తున్న సుజాత చుట్టూ చూసింది. ఎవరూ లేరు. వెంటనే వానిటీ బాగ్‌లోనుండి చిన్న పొట్లం తీసి కాఫీ వున్న ఫ్లాస్కులో వేసి మళ్లీ ఆ కాగితం బాగ్‌లో పెట్టేసింది.

ఆల్బమ్‌తో వచ్చిన రేణుక హుషారుగ కబుర్లు చెపుతూ ఫోటోలు చూపుతోంది.

'మరొక గంటలో నీ హుషారు చల్లబడుతుందిలే' కసిగ అనుకొంది మనస్సులో సుజాత.

చేతివంక చూసుకొంది.

'అయిదయ్యింది. వెళ్తా' నంటూ లేచింది.

ఇప్పుడు సుజాత మనస్సు గాలిలో తేలిపోతోంది.

ఆనందంతో పరవళ్లుతొక్కుతోంది.

ఏ జ్ఞాపకాలతో తన భర్త తనను నిరాదరణ చేస్తున్నాడో అవి సమూలంగ నాశనమవుతాయి. ఇక అతడు తననే దేవతగ ఆరాధిస్తాడు ... భార్యగ ప్రేమిస్తాడు ... ఓహ్ ... ఆనందంతో తృళ్లిపడుతూ ఇంట్లో అడుగుపెట్టింది.

ఆ తర్వాత కొద్దిసేపటికే ఎంబాసిడర్ హారన్‌మోత విని బయటకు వచ్చింది. ●

డాక్టర్ కబుర్లు

ఆస్ప్రిన్

పొరపాటున చిన్నబిడ్డ ఆస్ప్రిన్ బిళ్లలు మింగితే అది ప్రమాదకరమో కాదో ఎలా తెలుస్తుంది?

అమెరికాలో 'పాయిజన్ కంట్రోల్ సెంటర్' అనే సంస్థ ఉంది. వారి పరిశోధనలవల్ల తేలింది—

ఒక బిడ్డ బరువు 50 పవున్లు అయితే ఆ బిడ్డ 50 గ్రెయిన్ల ఆస్ప్రిన్ దాకా తిన్నప్పటికీ విషం కాకపోవచ్చు.

సాధారణంగా పెద్దలు మింగే ఆస్ప్రిన్ మాత్రలో 5 గ్రెయిన్ల ఆస్ప్రిన్ ఉంటుంది.

అంటే 50 పవున్ల బిడ్డ 10 మాత్రలదాకా తినవచ్చునన్న మాట!

80 పవున్ల బిడ్డ 16 మాత్రల దాకా తినవచ్చు.

ఇవన్నీ సగటు లెక్కలనిబట్టి చెప్పే విషయాలు; ఎందుకయినా సరే డాక్టరుకి చూపించటం మంచిది.

జబ్బు చేసిన పిల్లల విషయంలో ఒక పవునుకి ఒక గ్రెయిను అనే సిద్ధాంతాన్ని మార్చవలసి వస్తుంది.

అసలు చిన్న పిల్లలు ఎన్ని మాత్రలు మింగాలో ఎలా తెలుసుకోనటం?! ఇందుకోసమయినా డాక్టరుని సంప్రదించటం మంచిది..

మందు బిళ్లలన్నీ చిన్న పిల్లలకి అందకుండా దాచటం మంచిది!

హెచ్. ఎల్. హెర్స్టన్‌స్టోన్
(కాపీరయిటు)